సాక్షి
ఏలూరు

మంగళవారం । 21 । నవంబర్ । 2023



తెప్పోత్సవానికి ఏర్పాట్లు

ఈనెల 24 రాత్రి చినవెంకన్న తెప్పోత్సవానికి దేవస్థానం ఏర్పాట్లు చేస్తోంది. పుష్కరిణి మధ్యలోని మండపాన్ని, పరిసరాలను, తెప్పను రంగులతో తీర్చిదిద్దుతున్నారు. IIలో ▸



బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపిక

తూర్పుగోదావరి జిల్లా రాయవరంలో జరగనున్న అండర్–17 రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు మార్టేరు జెడ్పీ హైస్కూల్‌కు చెందిన ఏడుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. IIలో ▸



వలలో కొండచిలువ

కలిదిండి మండలం సానారుద్రవరంలో చేపల చెరువులో 10 అడుగుల కొండచిలువ వలకు చిక్కింది. ఫారెస్టు సిబ్బంది అటవీ కార్యాలయానికి తరలించారు. IIలో ▸

న్యూస్‌రీల్

దివ్యాంగులకు ముఖ్యమంత్రి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం చెక్కు అందిస్తున్న డీఆర్వో

ఏలూరు(మెట్రో): ఇటీవల నూజివీడు పర్యటనలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనను కలిసిన 12 మంది దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వ్యాధిగ్రస్తులకు ఆర్థిక సాయం అందించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీనిలో భాగంగా ముఖ్యమంత్రి పర్యటన రోజునే 9 మందికి జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్య వేణి, నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ ఆర్థిక సాయం చెక్కులను లబ్ధిదారులకు అందించారు. వారిలో మిగిలిన ముగ్గురికి సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా రెవిన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు ఆర్థిక సాయం చెక్కులను అందించారు. వీరిలో బానోతు సావిత్రికి రూ.2,00,000 (దివ్యాంగురాలు), తాళ్లూరి గోపాల స్వామికి రూ.1,00,000 (కిడ్నీ వ్యాధి బాధితుడు), వీరమల్ల తంబిబాబుకు రూ.1,00,000 (దివ్యాంగుడు) ఆర్థిక సాయం చెక్కులను డీఆర్‌ఓ అందజేశారు.

డిసెంబరు 3న ఎన్‌ఎన్‌ఎంఎస్ పరీక్ష

ఏలూరు (టూటౌన్): 2023–24 విద్యాసంవత్సరానికి జాతీయ ఉపకార వేతన పరీక్ష(ఎన్ఎన్ఎంఎస్) వచ్చే నెల 3న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి పి.శ్యాంసుందర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షకు హాజరవుతున్న విద్యార్థుల హాల్ టికెట్లను ప్రభుత్వ పరీక్షల సంచాలకుడి కార్యాలయం వెబ్‌సైట్ స్కూల్ లాగిన్‌లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఉపాధ్యాయులు పాఠశాల యూ–డైస్ కోడ్‌ను ఉపయోగించి విద్యార్థుల హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు.

22న డయల్ యువర్ డీపీటీఓ కార్యక్రమం

ఏలూరు (టూటౌన్): రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఏలూరు జిల్లా వ్యాప్తంగా ఈనెల 22వ తేదీ బుధవారం డయల్ యువర్ డీపీటీఓ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణా శాఖ అధికారి ఎన్‌వీఆర్ వరప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ఏలూరు, జంగారెడ్డిగూడెం, నూజివీడు డిపోల బస్సులకు సంబంధించి 22వ తేదీ ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకూ ఈ కార్యక్రమం నిర్వహిస్తారన్నారు. ప్రయాణికులు 99592 25526 నెంబరుకు ఫోన్ చేసి సమస్యలు తెలియజేయాలన్నారు.

26లోగా దరఖాస్తు చేసుకోవాలి

ఏలూరు (టూటౌన్): పదవ తరగతి, ఇంటర్‌లో 2023–24 సంవత్సరానికి అడ్మిషన్ల కోసం ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం, సంచాలకులు ఆదేశాల మేరకు అపరాధ రుసుం లేకుండా ఈ నెల 26 వరకు, రూ.200 అపరాధ రుసుంతో ఈ నెల 30 వరకూ దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా విద్యాశాఖాధికారి పి.శ్యాంసుందర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు రిజిస్ట్రేషన్ ఆన్‌లైన్ చేసుకోవచ్చునని, సంబంధిత ఓపెన్ స్కూల్ అధీకృత స్టడీ సెంటర్ల ద్వారా, గ్రామ, వార్డు సచివాలయం ద్వారా అడ్మిషన్‌లు పొందవచ్చన్నారు. ఫీజును ఏపీ ఆన్‌లైన్ ద్వారా చెల్లించవచ్చని తెలిపారు.

బాల కార్మికుల గుర్తింపునకు తనిఖీలు

ఏలూరు(మెట్రో): బాల కార్మికుల గుర్తింపు, పునరావాసం కార్యక్రమంలో భాగంగా జిల్లాలో ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు కార్మిక శాఖ ఉప కమిషనర్ పి.శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 20 నుంచి డిసెంబర్ 10 వరకు తనిఖీలు నిర్వహిస్తామన్నారు. ఈ నేపథ్యంలో సోమవారం జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు అధ్యక్షతన జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లా టాస్క్‌ఫోర్స్ కార్యాచరణపై చర్చించి సూచనలు ఇచ్చారు. తనిఖీల్లో భాగంగా స్థానిక వంగాయగూడెం సెంటర్‌లో బాలుడిని గుర్తించి విద్యా సంస్థలో చేర్పించారు.

వ్యభిచార గృహంపై దాడి

ఏలూరు టౌన్: ఏలూరు వన్‌టౌన్ గాంధీమైదానం సమీపంలో బొమ్మల గుడి సమీపంలో వైఎస్సార్ కాలనీ 15వ రోడ్డు ప్రాంతానికి చెందిన ఒక మహిళ నిర్వహిస్తోన్న వ్యభిచార గృహంపై పోలీసులు దాడి చేశారు. వ్యభిచార గృహాన్ని నిర్వహిస్తోన్న మహిళతోపాటు, విటుడు, బాధితురాలిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రూ.31 వేలు నగదు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వీరిపై సీఐ రాజశేఖర్ కేసు నమోదు చేశారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

● శివోహం



భీమవరం(ప్రకాశంచౌక్): భీమవరం ఉమా సోమేశ్వర జనార్ధన స్వామి ఆలయంలో స్వామికి అభిషేకం



పెనుగొండ: ఆచంటలో ఆచంటేశ్వరుడికి అభిషేకం

ఉమ్మడి పశ్చిమగోదావరిలోని శైవక్షేత్రాలు శివ నామస్మరణతో మార్మోగాయి. కార్తీక మాసం మొదటి సోమవారం సందర్భంగా భీమవరం ఉమాసోమేశ్వర జనార్ధన స్వామి ఆలయం, పాలకొల్లు క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయం, పట్టిసం వీరభద్రస్వామి క్షేత్రం, ఆచంటేశ్వర స్వామి ఆలయాలను వేలాది మంది దర్శించుకున్నారు. స్వామికి మహన్యాస పూర్వక అభిషేకాలు నిర్వహించారు. కార్తీక నోములు నోచుకున్నారు. – సాక్షి నెట్‌వర్క్



పాలకొల్లు సెంట్రల్: క్షీరారామలింగేశ్వర స్వామి ఆలయంలో మహన్యాసపూర్వక అభిషేకాల్లో కూర్చున్న భక్తులు



పోలవరం రూరల్: పట్టిసం శివక్షేత్రంలో వీరభద్రస్వామికి అభిషేకం చేస్తున్న దృశ్యం

చెక్‌పోస్టుల్లో హై అలర్ట్

- తెలంగాణఎన్నికల నేపథ్యంలో కట్టుదిట్టం
- కొత్తగా ఏలూరు, ఖమ్మం జిల్లాల మధ్య 7 చెక్‌పోస్టుల ఏర్పాటు
- ఏఆర్ సిబ్బందితో ప్రత్యేక పర్యవేక్షణ
- 277 కేసుల మద్యం.. 12,800 లీటర్ల సారా సీజ్



చింతలపూడి మండలం అల్లిపల్లి చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న అధికారులు

సాక్షి ప్రతినిధి, ఏలూరు: తెలంగాణ సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో బోర్డర్ చెక్‌పోస్టుల్లో హై అలర్ట్ ప్రకటించారు. ప్రస్తుతం ఉన్న చెక్‌పోస్టులతో పాటు కొత్తగా 7 చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి సరిహద్దు ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. చింతలపూడి, పోలవరం సబ్ డివిజన్ల పరిధిలో సరిహద్దు ప్రాంతాల్లో చెక్‌పోస్టుల్లో ద్విచక్రవాహనాలు మొదలుకొని బస్సుల వరకు నిత్యం తనిఖీలతో ఆయా ప్రాంతాల్లో కార్డన్ సెర్చ్ నిర్వహించి కేసులు నమోదు చేస్తున్నారు. దీంతో పాటు భారీగా మద్యం, నాటుసారా నిల్వలు సీజ్ చేసి కేసులు నమోదు చేస్తున్నారు. ఏలూరు, ఖమ్మంజిల్లా పోలీస్ ఉన్నతాధికారులు, కలెక్టర్లు సమావేశమై ప్రత్యేక నిర్ణయాలు తీసుకుని ఎన్నికల కమిషన్ నియామవళికి అనుగుణంగా తనిఖీల ప్రక్రియ కొనసాగిస్తున్నారు. ఏలూరు జిల్లా పరిధిలోని చింతలపూడి, పోలవరం సబ్‌డివిజన్లల్లో అల్లిపల్లి, లింగగూడెం, మద్రిగూడెం, తాటికల్లుగూడెం, కొయ్యమల్లవరం, వేలూరు, కృష్ణపాలెంలో ప్రత్యేకంగా చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. ప్రతి చెక్‌పోస్టు వద్ద ఏఆర్ సిబ్బందికి విధులు కేటాయించి 24 గంటలూ తనిఖీలు కొనసాగేలా షిఫ్టులు ఏర్పాటు చేసి విధులు నిర్వహిస్తున్నారు. తెలంగాణలో ఎన్నికల కోడ్ అమలులోకి రాగానే చెక్‌పోస్టులు అప్రమత్తం చేసి ఈ ప్రక్రియ కొనసాగిస్తున్నారు.

మద్యం సీజ్ : రేంజ్ పరిధిలో ఇప్పటి వరకు 132 కేసులు నమోదు చేసి 1185 లీటర్ల మద్యాన్ని సీజ్ చేశారు. రేంజ్ పరిధిలో మొత్తం 10 చెక్‌పోస్టులున్నాయి. ఏలూరు జిల్లా పరిధిలో ఇప్పటి వరకు 12,800 లీటర్ల నాటుసారా, ఇతర రాష్ట్రాలకు చెందిన నాన్‌డ్యూటీ పెయిడ్ లిక్కర్ సీజ్ చేశారు. సరిహద్దులోని గ్రామాల్లో 129 చోట్ల కార్డన్ సెర్చ్‌లు నిర్వహించి అసాంఘిక శక్తులు, అనుమానాస్పద వ్యక్తులపై బైండోవర్ కేసులు నమోదు చేశారు. అలాగే 232 మంది రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లపై బైండోవర్ కేసులు నమోదు చేశారు.

రేంజ్ నుంచి 760 మంది సిబ్బంది



“ తెలంగాణ ఎన్నికలకు రాష్ట్రం నుంచి 5 వేల మంది సిబ్బందిని బందోబస్తుకు కేటాయించారు. దీనిలో ఏలూరు రేంజ్ పరిధిలోని ఆరు జిల్లాల నుంచి 760 మంది సిబ్బందికి విధులు కేటాయించాం. 460 మంది హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, 300 మంది హోంగార్డులు తెలంగాణ ఎన్నికల పోలింగ్ సమయంలో బందోబస్తు విధుల్లో ఉంటారు. ఇప్పటికే అందరికీ ఎలక్షన్ డ్యూటీ ఆర్డర్లు పంపాం. నవంబర్ 30న పోలింగ్ జరగనున్న నేపథ్యంలో మూడు రోజుల ముందే సిబ్బంది విధుల్లోకి వెళ్తారు.

– జీవీవీ అశోక్ కుమార్, డీఐజీ

గ్యాస్ సిలిండర్ పేలి ఐదుగురికి గాయాలు



క్షతగాత్రుల కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న ఆర్డీఓ అచ్యుత్ అంబరీష్

పోడూరు: ఆచంట శివారు వల్లూరు తోట గ్రామంలో సోమవారం రాత్రి ఒక ఇంట్లో గ్యాస్‌సిలిండర్ పేలిన ఘటనలో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల వివరాల ప్రకారం దివి వెంకట్రావు ఇంట్లో వంట చేస్తుండగా గ్యాస్ సిలిండర్ పేలింది. ఈ ప్రమాదంలో ఇంట్లో ఉన్న దివి వెంకట్రావు(75), అతని భార్య ఆదిలక్ష్మి(60), కోడలు సావిత్రి(40) తీవ్రంగా గాయపడ్డారు. వీరిని కాపాడే ప్రయత్నంలో చుట్టుపక్కల ఉన్న బంధువులు దివి రత్నంరాజు, దివి ప్రసాదు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాద ఘటనతో గ్రామస్తులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. స్థానికుల సమాచారంతో క్షతగాత్రులను 108 వాహనంలో పాలకొల్లు తరలించారు. వెంకట్రావు, ఆదిలక్ష్మి పాలకొల్లు ప్రభుత్వాసుపత్రిలో, సావిత్రి, రత్నంరాజు, ప్రసాద్ పాలకొల్లులోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న వెంకట్రావు, ఆదిలక్ష్మిల పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

జగన్ పాలనలో గ్రామాల అభివృద్ధి సూపర్

ప్రముఖ క్రికెటర్ అంబటి రాయుడు



పెదపాడు మండలంలోని వట్లూరు- ఐటీఐ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ప్రముఖ క్రికెటర్ అంబటి తిరుపతి రాయుడు, కొఠారు అబ్బయ్యచౌదరి, జెడ్పీ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ

పెదపాడు: రాష్ట ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో గ్రామాల అభివృద్ధి సూపర్ అని ప్రముఖ అంతర్జాతీయ క్రికెట్ ఆటగాడు అంబటి రాయుడు అన్నారు. వాక్ విత్ అంబటి, కొఠారు కార్యక్రమంలో భాగంగా ఏలూరు జిల్లా పెదపాడు మండలం వట్లూరులో జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆళ్ల సతీష్‌చౌదరి ఆధ్వర్యంలో నిర్మించిన రూ.1 కోటి 16 లక్షల విలువైన అభివృద్ధి పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. అనంతరం దాతల సహకారంతో నిర్మించిన డైనింగ్ హాల్, పాఠశాల మైదానం అభివృద్ధి పనులను దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీతో పాటు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆయన విద్యార్థులను, గ్రామస్తులనుద్దేశించి మాట్లాడారు. గ్రామాల్లో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల కోసం చేపడుతున్నారని, వాటిని ప్రజలు సద్వినియోగం చేసుకుని మరింతగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. విద్యార్థులు పాఠశాలలో ఏర్పాటు చేసిన మౌలిక సదుపాయాలను సద్వినియోగం చేసుకుని బాగా చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. విద్యార్థులు చదువుతో పాటు ఆటల్లో కూడా రాణించాలని తెలిపారు. వట్లూరు సీతారామ పురంలో రూ.24 లక్షల వ్యయంతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని, రూ.21 వ్యయంతో నిర్మించిన హెల్త్ సెంటర్‌ను ప్రారంభించారు. అనంతరం వట్లూరు గ్రామంలో రూ.43 లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని ప్రారంభించారు. సుమారు రూ.90 లక్షల వ్యయంతో నిర్మించనున్న రోడ్డుకు శంకుస్థాన చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ, దెందులూరు ఏఎంసీ అధ్యక్షుడు ఆళ్ల సతీష్‌చౌదరి, పెదపాడు ఎంపీపీ బత్తుల రత్నకుమారి, బీసీ సెల్ అధ్యక్షుడు, నర్సాపురం నియోజకవర్గ పరిశీలకుడు ఘంటా ప్రసాదరావు, జెడ్పీటీసీ నిట్టా లీలా నవకాంతం, సర్పంచ్ గుజ్జుల రత్నకుమారి, జిల్లా పరిషత్ ఉపాధ్యక్షుడు పెనుమాల విజయ్, ఏలూరు, దెందులూరు మండలాల పార్టీ అధ్యక్షుడు తేరా ఆనంద్, కామిరెడ్డి నాని, సొసైటీ అధ్యక్షుడు ఆళ్ల శివరామకృష్ణ, ఉపసర్పంచ్ చింతా మధు, ప్రధానోపాధ్యాయురాలు ఏ.ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అర్జీలు గడువులోగా పరిష్కరించాలి



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ఏలూరు(మెట్రో): అర్జీదారుల సమస్యల పట్ల సకాలంలో స్పందించి నిర్ణీత గడువులోగా సంతృప్తికర స్థాయిలో పరిష్కార మార్గాలు చూపాలని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం–స్పందన కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి, డీఆర్‌ఓ ఎం.వెంకటేశ్వర్లు, డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయరాజు, ఆర్డీవో ఎన్.ఎస్.కె. ఖాజావలి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జీవీవీ సత్యనారాయణ హాజరై ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. జగనన్నకు చెబుదాం–స్పందన కార్యక్రమంలో 316 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీలను నిర్ణీత కాలవ్యవధిలో నాణ్యతతో కూడిన విధంగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అర్జీదారుడి సంతృప్తే ధ్యేయంగా పరిష్కారం ఉండాలని స్పష్టం చేశారు.

అర్జీల్లో కొన్ని..

- కుళాయి కనెక్షన్ సమస్యను పరిష్కరించాలని కైకలూరు మండలం ఆలపాడుకు చెందిన బండి శ్రీనివాసరావు కోరారు.
- సెక్షన్ 22ఎ లో నమోదైన తన భూమిని అందులో నుంచి తొలగించాలని ముసునూరు మండలం గోపవరం గ్రామానికి చెందిన అరకల రామారావు కోరారు.
- తమ ప్రాంతంలో ప్రభుత్వ వసతి గృహాన్ని మంజూరు చేయాలని ముదినేపల్లి మండలం గురజాకు చెందిన దారం చంటి కోరారు.
- తమ భూమికి చుట్టుపక్కల సరిహద్దు రైతులు సుమారు 15 సెంట్లు ఆక్రమించి గ్రావెల్ పోశారని ఈ విషయంలో తగు చర్యలు తీసుకోవాలని కామవరపుకోటకు చెందిన పరసా వెంకటశ్రీనివాసరావు కోరారు.

విజ్ఞానాన్ని పెంచుకోవాలి



పోటీల్లో గెలుపొందిన విద్యార్థినికి ప్రశంసాపత్రం అందజేస్తున్న చైర్‌పర్సన్ చీర్ల పద్మశ్రీ

ఏలూరు (టూటౌన్): విద్యార్థులు తమ విజ్ఞానాన్ని పెంపొందించుకోవడం ద్వారా ఉన్నత స్థితికి చేరవచ్చునని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ చీర్ల పద్మశ్రీ అన్నారు. 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ముగింపు సందర్భంగా స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో సోమవారం నిర్వహించిన ముగింపు సభలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. వారోత్సవాలను జిల్లా వ్యాప్తంగా ఉన్న 74 గ్రంథాలయాల్లో ఘనంగా నిర్వహించిన సిబ్బందిని అభినందించారు. జిల్లాలో పలు చోట్ల బాలలకు ప్రత్యేక గ్రంథాలయాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వారంరోజుల పాటు పలు అంశాలపై నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, వ్యాసరచన, చిత్రలేఖనం, క్విజ్, వక్తృత్వం, జనరల్ నాలెడ్జ్ తదితర అంశాలపై గెలుపొందిన వివిధ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు బహుమతులను అందజేశారు. గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం.శేఖర్‌బాబు, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ సభ్యులు వై.నరసింహారావు పలువురు వక్తలు గ్రంథాలయాల ప్రాముఖ్యత గురించి వివరించారు. కార్యక్రమంలో భాగంగా వివిధ పోటీల్లో గెలుపొందిన 150 మందికి పైగా విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థల సభ్యులు, పలు సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

రూరల్ టూరిజంలో దరఖాస్తుల ఆహ్వానం

భీమవరం(ప్రకాశం చౌక్): పర్యాటక రంగంలో ఉత్తమ పర్యాటక ప్రాంతాల ఎంపికకు 2024 ఏడాదికి పర్యాటక మంత్రిత్వ శాఖ దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. జిల్లా పర్యాటక శాఖ అధికారి ఎండీ.హెచ్.మెహరాజ్ ఓ ప్రకటన విడుదల చేశారు. వ్యవసాయ పర్యాటకం, బాధ్యతాయుత పర్యాటకం, వారసత్వ పర్యాటకం, కళాఖండాలు, శక్తివంతమైన గ్రామాలు, కమ్యూనిటీ ఆధారితం, వెల్ నెస్ రంగాలకు సంబంధించిన దరఖాస్తులకు అర్హులుగా పేర్కొన్నారు. వీరు తమ దరఖాస్తులను www.rural.tourism.gov.in వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ పద్ధతిలో దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. బెస్ట్ రూరల్ టూరిజం విలేజెస్‌గా ఎంపికైన గ్రామాలకు రాష్ట్ర, జాతీయస్థాయిల్లో పురస్కారాలు అందజేస్తారని ఈ సందర్భంగా తెలిపారు. మరిన్ని వివరాలకు 98499 09082, 63099 42024 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

పనులు ప్రారంభించకపోతే బ్లాక్‌లిస్ట్





జగనన్న ఇళ్ల నిర్మాణ ప్రగతిపై సమీక్షిస్తున్న కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్, పాల్గొన్న అధికారులు

ఏలూరు(మెట్రో): జిల్లాలో ప్రభుత్వ పనులు నిర్ణీత సమయంలో చేపట్టని కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్ట్‌లో ఉంచాలని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో సోమవారం జిల్లాలో రోడ్లు, ప్రాధాన్యతా భవనాలు, జగనన్న ఇళ్ల నిర్మాణ ప్రగతిపై సంబంధిత శాఖల ఇంజినీరింగ్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా రోడ్లు భవనాల శాఖ ద్వారా జాతీయ రహదారుల విభాగంలో 5 రోడ్ల నిర్మాణ పనులకు టెండర్లు పూర్తయ్యి ఎల్.ఓ ఇచ్చిన 7 రోజులలోగా అగ్రిమెంట్ చేయాల్సిన కాంట్రాక్టర్లు 45 రోజులు పూర్తి కావస్తున్న అగ్రిమెంట్లు పూర్తిచేయకపోవడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే కాంట్రాక్టర్లకు నోటీసులు జారీ చేయాలని, నోటీసులకు స్పందించని కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్ట్‌లో ఉంచాలని ఆదేశించారు. అధిక ప్రాధాన్యత గల రోడ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలన్నారు. జగనన్న ఇళ్ల నిర్మాణంలో అలసత్వం వహించే సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటానని కలెక్టర్ హెచ్చరించారు. అలసత్వం వహించే సిబ్బందికి ఇంక్రిమెంట్ నిలిపివేయాలని ఆదేశించారు. చేబ్రోలులో జగనన్న ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయడంలో ఉత్తమ సేవలందించిన గృహ నిర్మాణ శాఖ ఇంజనీరింగ్ అధికారులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. సమావేశంలో గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ అధికారి విజయరాజు, డ్వామా పీడీ రాము, రోడ్లు భవనాల శాఖ, పంచాయతీ రాజ్, సూపరింటెండెంట్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

స్పందన అర్జీలను సత్వరం పరిష్కరించాలి

ఎస్పీ రవిప్రకాష్



స్పందనలో మహిళల అర్జీని పరిశీలిస్తున్న ఎస్పీ రవిప్రకాష్

భీమవరం : స్పందనలో వచ్చిన ఫిర్యాదుల న్నింటిపై చట్ట ప్రకారం విచారణ చేసి ఫిర్యాదుదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఎస్పీ యు.రవిప్రకాష్ అధికారులను ఆదేశించారు. భీమవరం డీఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితులతో ఎస్పీ మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన 21 మంది బాధితులు అర్జీలు అందజేశారన్నారు. ఫిర్యాదుల్లో ఎక్కువగా వరకట్న వేధింపులు, సరిహద్దుల గొడవలు, సివిల్ తగాదాలకు సంబంధించినవి ఉన్నాయన్నారు. అనంతరం ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలని, సంబంధిత పోలీసు అధికారులను ఫోన్‌లో ఆదేశించారు. స్పందనలో ఎస్పీతో పాటు ఏఎస్పీ ఏవీ సుబ్బరాజు పాల్గొని ఫిర్యాదులు స్వీకరించారు.

శబరిమలకు 22 ప్రత్యేక రైళ్లు

ఏలూరు (టూటౌన్): శబరిమలకు వెళ్లే భక్తుల కోసం దక్షిణ మధ్య రైల్వే 22 ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ సీహెచ్ రాకేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీటిలో ఒక రైలు నరసాపురం–కొట్టాయం మధ్య కాగా, రెండోది కాకినాడ టౌన్–కొట్టాయం మధ్య నడుపుతారు. 07119 నంబర్‌తో నర్సాపురం నుంచి కొట్టాయం వరకు ఈ నెల 26న, వచ్చే నెల 3వ తేదీలలో నడుస్తుంది. 07120 నంబర్‌తో కొట్టాయం నుంచి నరసాపురానికి ఈ నెల 27, డిసెంబరు 4వ తేదీలలో తిరుగు ప్రయాణమవుతుంది. అలాగే 07125 నంబర్‌తో కాకినాడ టౌన్ నుంచి కొట్టాయంకు ఈ నెల 23, 30 తేదీలలో నడుపుతారు. 07126 నంబర్‌తో కొట్టాయం నుంచి నరసాపురానికి ఈ నెల 25, డిసెంబరు 2 తేదీలలో తిరుగు ప్రయాణమవుతుంది.

ఉరి వేసుకుని శిల్పి ఆత్మహత్య

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని రాజీవ్‌నగర్‌లో ఓ శిల్పి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కర్రి వెంకటరమణ (34) శిల్పి. ఆర్థిక ఇబ్బందుల కారణంగా సోమవారం రాజీవ్‌నగర్‌లోని తన రేకుల షెడ్డు ఇంట్లో ఇనుప గొట్టానికి చున్నీతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వెంకటరమణకు భార్య, 10 ఏళ్ల కుమారుడు ఉన్నారు. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.

శైవక్షేత్రాల్లో భక్తులకు సౌకర్యాల పెంపు

- గోదావరి జిల్లాల్లో 300 ఆలయాల్లో కార్తీక మాసోత్సవాలు
- దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్ ఎంవీ విజయరాజు
- గునుపూడి సోమేశ్వరస్వామి ఆలయంలో ఏర్పాట్ల పరిశీలన



గునుపూడి పంచారామ క్షేత్రంలో విలేకరులతో మాట్లాడుతున్న డీసీ ఎం.విజయరాజు

భీమవరం (ప్రకాశంచౌక్): కార్తీకమాసోత్సవాల్లో భాగంగా గోదావరి జిల్లాల్లో సుమారు 300 ఆలయాల్లో భక్తులకు ఇబ్బందులు లేకుండా ప్రత్యేక సౌకర్యాలు కల్పించామని దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్ ఎంవీ విజయరాజు చెప్పారు. సోమవారం భీమవరం పంచారామ క్షేత్రంలో కార్తీకమాస ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. తొలుత ఉమా సోమేశ్వరస్వామివారిని డీసీ దర్శించుకున్నారు. అనంతరం కార్తీక మాసానికి సంబంధించి ఆలయంలో ఏర్పాట్లపై ఆలయ అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం విలేకరుల సమావేశంలో డీసీ మాట్లాడుతూ ఉభయ గోదావరి జిల్లాల్లో ప్రముఖ శైవక్షేత్రాలకు కార్తీకమాసంలో ఇతర జిల్లాల నుంచి సైతం భారీగా భక్తులు తరలివస్తున్న నేపథ్యంలో ఆయా ఆలయాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. భక్తులకు మంచినీటి సౌకర్యం, టాయిలెట్స్, దేవస్థానాల వద్ద అన్నదానం తదితర సౌకర్యాలు కల్పించామన్నారు. భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోట దేవస్థానాలకు సోమవారం భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుందన్నారు. అందుకు తగ్గట్లు సోమవారం ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేసి భక్తులకు స్వామివారి దర్శనం సులువుగా జరిగేలా చర్యలు తీసుకున్నామన్నారు. తూర్పుగోదావరి జిల్లాలో హిందూ ధర్మ ప్రచార యాత్ర కొనసాగుతోందని, వచ్చేనెలలో పశ్చిమగోదావరి జిల్లాలో కూడా ఈ యాత్ర నిర్వహిస్తామన్నారు. దేవస్థానం భూములను పరిరక్షించడానికి రాష్ట్ర, జిల్లా స్థాయి కమిటీలు ఏర్పడ్డాయన్నారు. దేవస్థానం భూములకు సంబంధించి అన్యాక్రాంతమైన భూములను వెలికితీసి ఆయా దేవస్థానాలకు అప్పగించడం ఈ కమిటీలకు ప్రథమ లక్ష్యంగా ఉంటుందన్నారు. భీమవరం పంచారామ క్షేత్రానికి సంబంధించి ఓ ధర్మకర్త నియామకం నిబంధనలు అతిక్రమించి ఉందని వచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టామన్నారు. భీమవరంలో వేణుగోపాలస్వామి దేవస్థానానికి సంబంధించిన స్థల వివాదం పరిష్కరించుకుని, చట్ట ప్రకారం దేవదాయ శాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో దేవదాయశాఖ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ సుబ్బారావు, పంచారామక్షేత్రం ఈఓ డి.రామకృష్ణంరాజు, ఇన్‌స్పెక్టర్ వర్దినీడి వెంకటేశ్వరరావు, ఈఓలు శ్రీనివాసరావు, ఎస్.శ్రీనివాసరావు, డీవీ కృష్ణంరాజు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి



ఆగిరిపల్లి: పోతవరప్పాడు వద్ద ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఆగిరిపల్లి ఎస్సై నంబూరు చంటిబాబు సోమవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సుమారు 20 నుంచి 25 ఏళ్ల వయస్సు కలిగిన గుర్తు తెలియని వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. గుర్తు తెలియని వ్యక్తి మూడు రోజుల నుంచి మతిస్థిమితం లేక చుట్టుపక్కల గ్రామాల్లో తిరుగుతున్నట్లు గ్రామస్తులు తెలిపారన్నారు. పోతవరప్పాడు వీఆర్వో ఇచ్చిన ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని నూజివీడు ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బస్సులో చోరీపై కేసు నమోదు

ఏలూరు టౌన్: బస్సులో ఓ ప్రయాణికురాలి బ్యాగ్ నుంచి బంగారు ఆభరణాల చోరీకి గురికాగా, బాధితురాలి ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసినట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు. లింగపాలెం మండలం వేములపల్లి గ్రామానికి చెందిన కంచన భవానీ మచిలీపట్టణంలోని తన అత్త ఇంటి నుంచి ఈనెల 15న బస్సులో తన స్వగ్రామమైన వేములపల్లి బయలుదేరారు. ఏలూరు పాత బస్టాండ్‌లో బస్సు దిగి, జంగారెడ్డిగూడెం వెళ్లే బస్సు ఎక్కారు. అయితే బస్సు ఎక్కుతున్న క్రమంలో మహిళకు ఎదురుగా మరోకరి చెయ్యి బ్యాగ్‌కు తగిలింది. బస్సు ఎక్కిన అనంతరం మహిళ తన బ్యాగ్‌ను పరిశీలించగా 6 కాసుల బంగారు ఆభరణాలు, నాలుగు తులాల వెండి వస్తువులు, కొంత నగదు కనిపించలేదు. ఎవరో అపహరించారని గుర్తించిన బాధితురాలు సోమవారం ఏలూరు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తిపై అట్రాసిటీ కేసు నమోదు

ఏలూరు టౌన్: ఒక మహిళతో వివాహేతర సంబంధం కొనసాగించి ఒక బిడ్డకు జన్మనిచ్చిన అనంతరం ఆమెను పట్టించుకోకపోవడంతో బాధితురాలు ఏలూరు టూటౌన్ పోలీసులను ఆశ్రయించింది. వివరాలిలా ఉన్నాయి. ఏలూరులో గన్‌బజార్‌కు చెందిన ఒక మహిళతో దెందులూరు మండలం కొవ్వలి గ్రామానికి చెందిన గోవాడ నాగాంజనేయులు గత కొన్నేళ్ల నుంచి సహజీవనం చేస్తున్నాడు. వారికి ఒక బిడ్డ కూడా జన్మించింది. ఇల్లు కడుతున్నానని ఆమె వద్ద నుంచి రూ.3 లక్షలు నగదును తీసుకున్నాడు. కట్టిన ఇంట్లోకి ఆమెను, ఆమె బిడ్డను ఇంట్లోకి తీసుకువెళ్లకుండా మానసికంగా బాధించటంతో ఏలూరు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో నాగాంజనేయులుపై పోలీసులు చీటింగ్ కేసు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీవారి తెప్పోత్సవానికి శరవేగంగా ఏర్పాట్లు





తెప్పను సిద్ధం చేస్తున్న సిబ్బంది, పుష్కరిణిలో నాచు, చెత్తను తొలగిస్తున్న సిబ్బంది

ద్వారకాతిరుమల: చినవెంకన్న తెప్పోత్సవానికి శ్రీవారి పుష్కరిణి (నృసింహ సాగరం) సర్వాంగ సుందరంగా ముస్తాబవుతోంది. క్షీరాబ్ధి ద్వాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈనెల 24న రాత్రి స్వామివారి తెప్పోత్సవాన్ని వైభవంగా నిర్వహించేందుకు దేవస్థానం భారీగా ఏర్పాట్లు చేస్తోంది. అందులో భాగంగా పుష్కరిణి మధ్యలో ఉన్న మండపాన్ని, సాగర పరిసరాలను, తెప్పను రంగులతో తీర్చిదిద్దుతున్నారు. గట్లపై ఉన్న ముళ్ల పొదలను తొలగించి, విద్యుద్దీప అలంకారాలు చేస్తున్నారు. అలాగే పుష్కరిణిని బోరు నీటితో నింపుతున్నారు. ఉత్సవం జరిగే రోజు రాత్రి స్వామివారు ఉభయదేవేరులతో కలసి తొళక్క వాహనంపై క్షేత్ర పురవీధుల్లో ఊరేగి, 8 గంటల సమయంలో పుష్కరిణి వద్దకు చేరుకుంటారు. ఆ తరువాత తెప్పోత్సవం ప్రారంభమౌతుందని ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు తెలిపారు. భక్తులు ఈ వేడుకలో భారీగా పాల్గొనాలని ఆయన కోరారు.

ప్రమోషన్ వర్క్ పేరుతో భారీగా మోసం

- దశలవారీగా రూ.10 లక్షలు కాజేసిన సైబర్ నేరగాళ్లు
- పోలీసులను ఆశ్రయించిన బాధితురాలు.. కేసు నమోదు

ఏలూరు టౌన్: ఏలూరు శనివారపుపేటకు చెందిన ఒక మహిళను సైబర్ నేరగాళ్లు మోసం చేసి భారీగా సొమ్మును కాజేశారు. ప్రమోషన్ వర్క్ పేరుతో రూ.వెయ్యి నుంచి మొదలు పెట్టి ఏకంగా రూ.10 లక్షలు కాజేయటంతో మహిళ తీవ్ర మానసిక వేదనకు గురై ఏలూరు సైబర్ పోలీసులను ఆశ్రయించింది. ఏలూరు త్రీటౌన్ పోలీసులు దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఏలూరు సైబర్ క్రైమ్ ఎస్సైన రాజా ఆధ్వర్యంలో బాధితురాలికి కౌన్సెలింగ్ ఇచ్చి కేసును త్రీటౌన్ స్టేషన్‌కు బదిలీ చేశారు. వివరాల్లోకి వెళితే.. ఏలూరు శనివారపుపేట ప్రాంతానికి చెందిన జాహ్నవికి వాట్సాప్‌లో అపరిచిత నంబర్ నుంచి పలు మెస్సేజ్‌లు వచ్చాయి. ప్రమోషన్ వర్క్ చేయాలని, లాభాలు భారీగా వస్తాయంటూ ఆశ చూపించారు. ఆమె తన ల్యాప్‌టాప్ నుంచి వారితో వాట్సాప్‌లో మెస్సేజ్‌లతో సంభాషించారు. తొలుత వెల్‌కం టాస్క్ పేరుతో రూ.వెయ్యి చెల్లించగా ఆమెకు రూ.1300 ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఖాతాలో జమ చేశారు. అనంతరం రూ.2 వేలు, రూ.3 వేలు చొప్పున కట్టించుకున్నారు. రెండో రౌండ్ అంటూ రూ.21వేల 800 కట్టాలని చెప్పారు. అలాగే 3వ రౌండ్ అంటూ రూ.70 వేలు కడితేనే మీకు ఇప్పటివరకు రావాల్సిన సొమ్ములు మొత్తం వస్తాయని షరతు విధించారు. జాహ్నవి ఇలా దఫదఫాలుగా స్నేహితుల వద్ద అప్పులు చేయటం, ఇంట్లోని బంగారాన్ని తాకట్టు పెట్టిమరీ సుమారుగా రూ.10 లక్షల వరకు చెల్లించింది. రోజుల గడుస్తున్నా తనకు రావాల్సిన డబ్బులు రాకపోవటంతో మోసపోయానని గుర్తించి పోలీసులను ఆశ్రయించింది. ఏలూరు త్రీటౌన్ సీఐ శివాజీ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

● విరగ కాసిన మునగ



జంగారెడ్డిగూడెం ఉప్పలమెట్టలోని ఓ ఇంట్లో మునగ చెట్టు విరగకాసింది. ఆకులు కూడా కనిపించనంతగా కాయలు కాయడంతో స్థానికులు అబ్బురపడుతున్నారు. ఆ ఇంటి జి.గంగరాజు, మణికుమారి దంపతులు చెట్టు కొమ్మలకు ఊతంగా కర్రలను ఏర్పాటు చేశారు.

– జంగారెడ్డిగూడెం

వలకు చిక్కిన కొండచిలువ



కొండచిలువను చూపుతున్న కైకలూరు అటవీశాఖ సిబ్బంది

కైకలూరు: కలిదిండి మండలం సానారుద్రవరంలో చేపల చెరువులో సంచరిస్తున్న 10 అడుగుల కొండచిలువ ఆదివారం వలకు చిక్కింది. రైతులు దానిని సంచిలో బంధించి కలిదిండి పోలీస్‌స్టేషన్‌కు తరలించగా, సిబ్బంది కైకలూరు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. ఫారెస్టు సిబ్బంది టి.సురేష్, వై.సౌజన్యకుమార్ వెళ్లి కొండచిలువను కైకలూరు అటవీ కార్యాలయానికి తరలించారు. ఈ సందర్భంగా అటవీశాఖ ఫారెస్టు డెప్యూటీ రేంజర్ సూర్యప్రకాష్ మాట్లాడుతూ ఈ కొండచిలువను ఇండియన్ రాక్ పైథాన్ అంటారన్నారు. సుమారు 8–9 నెలల వయస్సు ఉంటుందన్నారు. జంగారెడ్డిగూడెం అటవీప్రాంతంలో దీనిని సురక్షితంగా విడిచిపెడతామన్నారు. కొండచిలువలు విషసర్పాలు కాదని, ఆకారం పెద్దగా ఉండటంతో కొట్టి చంపుతున్నారన్నారు. ఎక్కడైనా కనిపిస్తే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించాలని కోరారు.

● గడపగడపకు సంక్షేమం



జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెం 19వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ మహిళకు సంక్షేమ పథకాల ద్వారా అందిన లబ్ధిని వివరిస్తున్న చింతలపూడి ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా



కుక్కునూరు: తొండిపాకలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ మహిళకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

బాస్కెట్‌బాల్ రాష్ట్ర పోటీలకు మార్టేరు విద్యార్థులు



విద్యార్థులతో పీడీ కృష్ణారెడ్డి

పెనుమంట్ర: తూర్పుగోదావరి జిల్లా రాయవరంలో ఈనెల 24 నుంచి 26వ తేదీ వరకు జరిగే అండర్–17 రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు మార్టేరు శ్రీవేణుగోపాల జెడ్పీ హైస్కూల్‌కు చెందిన ఏడుగురు విద్యార్థులు ఎంపికైనట్లు పీడీ, జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షులు కర్రి కృష్ణారెడ్డి సోమవారం తెలిపారు. టీమ్ కెప్టెన్‌గా నక్కా సందీప్‌తో పాటు సకిలే కిశోర్, గుళ్లపూడి వరప్రసాద్, మునకాల సాంబసూర్య, షేక్ సిరజ్‌బాషా, మామిడి సోమశేఖర్, జుత్తిగ అనిష్ పశ్చిమగోదావరి జిల్లా జట్టు తరపున ఆడనున్నారన్నారు. వీరికి బాస్కెట్ బాల్ అకాడమీ తరపున మార్టేరులో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.

23న మహిళా కబడ్డీ జిల్లా జట్టు ఎంపిక

తణుకు అర్బన్: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా మహిళా కబడ్డీ జట్టు ఎంపిక పోటీలు తాడేపల్లిగూడెం మండలం పెదతాడేపల్లిలోని శ్రీవాసవి ఇంజనీరింగ్ కళాశాలలో ఈనెల 23న నిర్వహించనున్నట్లు జిల్లా అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ వై.శ్రీకాంత్, అధ్యక్షులు కౌరు శ్రీను, చైర్మన్ అప్పలరాజు సోమవారం తెలిపారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు తమ ఆధార్ కార్డుతో ఆరోజు మధ్యాహ్నం 2 గంటలకు రిపోర్టు చేయాలని, క్రీడాకారుల బరువు 75 కేజీలలోపు మాత్రమే ఉండాలని సూచించారు. ఇతర వివరాలకు 94913 33906, 96424 96117 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

వివాహితను వేధిస్తున్న అత్త, మామపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: అత్త మామ వేధింపులు తాళలేక ఓ వివాహిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఆర్.మల్లికార్జునరెడ్డి చెప్పారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నూతి రేణుకకు ఏడేళ్ల క్రితం వివాహం కాగా, భర్త, అత్తమామలతో వేగవరంలో నివాసం ఉంటోంది. రేణుక భర్త జంగారెడ్డిగూడెంలో ఓ ప్రైవేట్ కాలేజ్‌లో అధ్యాపకునిగా పనిచేస్తున్నాడు. అయితే భర్త ఇంట్లో లేని సమయంలో అత్తమామలు వేధింపులకు గురిచేస్తున్నారని, మానసికంగా, శారీరకంగా హింసిస్తున్నారని రేణుక పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నేడు కైకలూరులో మత్స్యకార దినోత్సవం

కైకలూరు: ప్రపంచ మత్స్యకార దినోత్సవం సందర్భంగా కైకలూరు మత్స్యశాఖ కార్యాలయంలో మంగళవారం ఆక్వా రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నామని మత్స్యశాఖ సహాయ సంచాలకులు షేక్ చాంద్ బాషా సోమవారం చెప్పారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) హాజరవుతారన్నారు. కై కలూరు నియోజకవర్గం నాలుగు మండలాల్లో 75,304 ఎకరాల్లో ఆక్వా సాగు జరుగుతోందన్నారు. నియోజకవర్గంలో 70 ఫిషర్‌మెన్ సొసైటీలలో 5,911 మంది సభ్యులు ఉన్నారన్నారు. నియోజకవర్గంలో 16 ఐస్ ఫ్యాక్టరీలు, మూడు ప్రాసెసింగ్ ప్లాంట్లు, నాలుగు మేతల తయారీ కంపెనీలు ఉన్నాయన్నారు. ఆక్వా రైతులకు ప్రభుత్వం విద్యుత్ సబ్సిడీ, పలు పథకాలు, రుణాలు అందిస్తోందన్నారు. మత్స్యకార దినోత్సవ కార్యక్రమాన్ని ఆక్వా రైతులు విజయవంతం చేయాలని కోరారు.

ఆటో ఢీకొని ఇద్దరు కూలీల దుర్మరణం

ఏలూరు టౌన్: తాపీ పనులు ముగించుకుని బైక్‌పై ఇంటికి వెళుతుండగా ఆటో ఢీకొనడంతో ఇద్దరు కూలీలు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. వివరాలిలా ఉన్నాయి. పెదవేగి మండలం భోగాపురానికి చెందిన అబ్బదాసు ఏసుబాబు (35), బొక్కతట్టి వెంకటేశ్వరరావు (25) తాపీ పనులు చేసుకుని జీవిస్తున్నారు. వీరిద్దరూ ఆదివారం రాత్రి పనులు ముగిసిన అనంతరం వట్లూరు నుంచి భోగాపురంలోని ఇళ్లకు బైక్‌పై బయలుదేరారు. వట్లూరు శివారు సమీపంలో వేగంగా వస్తున్న ఆటో ఎదురుగా వచ్చి వీరిని ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాల పాలైన ఏసుబాబు, వెంకటేశ్వరరావు ఘటనా స్థలంలోనే మృతి చెందారు. సమాచారం అందుకున్న ఏలూరు త్రీటౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం తీరును పరిశీలించారు. మృతదేహాలను ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. సోమవారం మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.1.19 కోట్లు



హుండీ నగదు లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయ హుండీల నగదు లెక్కింపు స్థానిక ప్రమోద కల్యాణ మండపంలో సోమవారం అత్యంత కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల నడుమ జరిగింది. ఈ లెక్కింపులో శ్రీవారికి విశేష ఆదాయం సమకూరింది. గడిచిన 14 రోజులకు గాను నగదు రూపేణా స్వామివారికి రూ.1,19,48,451 ఆదాయం లభించినట్టు ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు చెప్పారు. అలాగే కానుకల రూపేణా భక్తులు సమర్పించిన 91 గ్రాముల బంగారం, 3.012 కేజీల వెండితో పాటు, అధికంగా విదేశీ కరెన్సీ లభించిందన్నారు. అదేవిధంగా లెక్కింపులోకి రాని రద్దు అయిన పాత రూ.2 వేలు, రూ.వెయ్యి, రూ.500 నోట్ల ద్వారా రూ.40,500 లభించినట్టు తెలిపారు.

డాగ్ స్క్వాడ్ పనితీరు తనిఖీ

భీమవరం: పోలీసు శాఖలో డాగ్ స్క్వాడ్ పనితీరును ఎస్పీ యు.రవిప్రకాష్ పరిశీలించారు. వార్షిక పనితీరు పరీక్షల్లో భాగంగా సోమవారం ఎక్స్‌ప్లోజివ్ డాగ్స్‌కి ఒబీడీఎస్ టెస్ట్, ఎక్స్ ప్లోజివ్ ప్రాంతంలో తనిఖీ, అనుమానాస్పద వస్తువులు డ్రగ్స్ తనిఖీలు, వెహికల్ సెర్చ్, రద్దీగా ప్రాంతాల్లో అనుమానిత బ్యాగుల తనిఖీ, ట్రాకింగ్ తదితర అంశాల్లో పరీక్షలు నిర్వహించారు. ఏఆర్ డీఎస్పీ ఎంవీవీ సత్యనారాయణ, ఆర్ఐ శ్రీకాంత్, మోసెస్ తదితరులు పాల్గొన్నారు.